
# థ్రిల్

ప్రణవి (గొలుసుకథ -4)



రామకృష్ణ అమిత వేగంగా కారు డ్రైవ్ చేస్తున్నాడు. ఆ పల్లెటూరి రోడ్డుమీద దుమ్ము లేపుకుంటూ పోతూంది. రామయ్య మాస్టారు తమ స్వగ్రామమైన రాజుపాలెంలో సీతారామ కళ్యాణం మూడు రోజులపాటు ఘనంగా చేయిస్తున్నారు. అందుకుగాను మాస్టారి కోరిక మీద ఆ మూడు రోజులు అక్కడ హాయిగా గడపాలని, భాస్కర్ కారులో నలుగురూ బయలుదేరారు.

రామకృష్ణకు డ్రైవింగ్ తెలుసు. అందుకే ఆ బాధ్యత తాను తీసుకున్నాడు. అతని ప్రక్కన భాస్కర్, వెనుక

వెంకోజీ, శర్మలున్నారు.

ఎంత చెప్పినా వినకుండా అరవై పైన వెళు తున్నాడు రామకృష్ణ. ఊరు సమీపిస్తూండగా రోడ్డుకు అడ్డంగా పెద్ద మర్రిచెట్టు రాక్షసిలా కనిపించింది.

దాన్ని తప్పకుని ముందుకు పోయేసరికి ఎదురుగా రెండెడ్లబండి ఎదురై, గుండె గుభేలు మంది అందరికీ. క్షణంలో చాకచక్యంగా ప్రమాదాన్ని తప్పించాడు రామ కృష్ణ. కాని, రోడ్డు దాటి, చేలలోకి పోయి ఆగింది.

అంతా ఒక్క నిమిషం సేదతీరి, గుండెలు నిబ్బ రించాక కారు స్టార్టుచేసి రోడ్డుకు మళ్ళించి, నలభైతో సాగారు.

"స్టీరింగ్ దొరికినంత మాత్రాన, అంత అదిరిపాటు పనికిరాదు ఎవరికైనా!" భాస్కర్ కొరకొరా మాస్తూ అన్నాడు.

"ఆ రాములవారు మనల్ని రక్షించకపోతే నలుగురమే కాక, రెండెడ్లూ, ఆ బండివాడు కూడా పేపర్లో పడేవాళ్ళం!" శ ర్మ గొణిగాడు.

"కోతికి కొరివిచ్చినట్టు, యు.డి.సి.గాడికి కారిస్తే అంతే మరి!" వెంకోజీ విసుక్కున్నాడు.

"అంతా నన్నాడి పోసుకోపోతే, బ్రహ్మరాక్షసిలా రోడ్డుకి అడ్డంగా వున్న ఆ దెయ్యాల మర్రిని గురించి ఒక్కడూ ఆలోచించడేం? ఇప్పటిదాకా రెండొందల కిలోమీటర్లు నేను సేఫ్‌గా డ్రైవ్ వెయ్యలే!" రామకృష్ణ కసిరాడు.

"అఘోరించావులే! అది దెయ్యాలమర్రేం కాదు. ఊరికే వాగకు! దెయ్యాల్లేవు! భూతాల్లేవు!" భాస్కర్ ఉవాచ.

"ఈయనకి తెలుసు! దయ్యాల్లేవుట!......అక్కడ ఎన్ని ప్రమాదాలు జరిగినయ్యో! ఎంతమంది వచ్చి, ఆ మర్రిచెట్టు మీద దెయ్యాలై కూర్చున్నారో! మీకేం తెలుసు!" రామకృష్ణ చిటపటలు.

"సరే నువ్వు వూరుకోరా! మధ్యలో దెయ్యాల గొడవ! అదో! ఆ ఎడమవైపు తిప్పు. అక్కడే ఎవరన్నా అడిగితే మాస్టారిల్లు మాపిస్తారు!" శర్మ అన్నాడు.

మొత్తానికి క్షేమంగా మాస్టారింటికి చేరారు. ఆయ నకి పట్టరాని సంతోషం కలిగింది. వారికి స్నానపానాలు, బస ఏర్పాటు చేశారు.

ఆ గ్రామంలోని యువతరం కమిషనర్ భాస్కర్‌ని మిత్రబృందాన్ని కలిసి, సరదాగా కబుర్లు చెప్పారు. భక్తి మీద రకరకాల చర్చలు జరిగాయి.

భక్తి మనస్సులో వుంటే చాలని, బయటకి కనబరచ నవసరం లేదని, భజనలు చెయ్యడం, సాష్టాంగ దండ ప్రమాణాలు చెయ్యడం, చేతులు జోడించి నమస్క రించడం ఇవన్నీ శుద్ధ దండుగ పనులనీ భాస్కర్ అన్నాడు.

యదార్థంగా ఆలోచించారో, లేక ఆయన పదవికి మెచ్చుకొని ఆలోచించారోగాని, యువకులంతా వంత పాడారు.

ముగ్గురు మిత్రులు ఒకరి ముఖాలు ఒకరు చూసు కున్నారు.

"అదేమిటి భాస్కర్! 'ఓం శివాయనమః, మహేశ్వ రాయనమః, శంభవే నమః' అని పూజ చేసేటప్పుడు నమస్కరించడం పద్ధతి! ఈ విధి, విధానాలెలా మాను కుంటాం?" శర్మ అడిగాడు.

# చరణం

ఇండియా అంతా
విలయంగా కలయదిరుగుతూ
క్షణక్షణం
బంగారం లాంటి
'భారతీయ ఆత్మ'
ఇదుగో యిక్కడ కనిపిస్తోంది
అదుగో అక్కడ మరుగవుతోంది
అంటూ అంచనాల
సంచలనాలలో
మునిగి తేలుతూ వుండగా—
శృంగారాలు పులుముకున్న
'ఆ సేతు శీతనగం'
'ఈశావాస్య మిదం సర్వమ్'
అని సాక్షీభూతంగా
చాటువులా చరిస్తోంది!

—"శ్రీ విరించి"



"తప్పకుండా మానుకోవాలి! ఈ మంత్రాలు, తంత్రాలు కాదు మనక్కావలసింది! టూరిత్! యదార్థం!......మనలో మ్మాట! అసలీ రాములవారి కళ్యా ణానికి నేవచ్చేవాడిని కాదు. కేవలం మాస్టారి మీద అభిమానం కొద్దీ ఆయన మాట కాదనలేక రావలసి వచ్చింది!" భాస్కర్ అన్నాడు.

మళ్ళీ జనం భాస్కర్‌ని సపోర్టు చేశారు. మిత్రులు తెల్లముఖాలేశారు.

"దేవుడూ, దెయ్యమూ అనే యీ మూఢ నమ్మకాలు కాల నుంచి మన జాతి బయట పడనంత వరకు మనకు ప్రగతి లేదండీ!" ఒక యువకుడు ఉద్ఘాటించాడు.

"చంద్రుడు దేవుడని మన వాళ్ళంటే, అది పనికి మాలిన రాళ్ళగుట్టని అమెరికా వాళ్ళు నిరూపించేరు! ఇంకా యీ మూఢనమ్మకాలతో, మంత్రాలు, తంత్రా లతో ఎంతకాలం మనల్ని మనం మోసం చేసు కుంటాం?" మరో అభ్యుదయవాది బల్ల గుద్దాడు.

"మంత్రాలు మహిమాన్వితమైనవని, వాటిని పఠిస్తూ యజ్ఞ యాగాలు చేసి రకరకాల ఫలితాలను పొందినట్లు మన పురాణాలు చెపుతున్నాయి కదా!" శర్మ అడిగాడు.

"అవన్నీ పుక్కిట పురాణాలని అంటారు కదండీ!" అంతా ఘొల్లున నవ్వారు.

"ఒరేయ్ శర్మా! నీలాంటి వాళ్ళు వున్నంత కాలం, లేదా, మారనంత కాలం మాయలూ, మంత్రాలూ, బాబాలూ, భజనలూ సాగుతాయిలే! దిగులుపడకు!" భాస్కర్ సమాధానికి మళ్ళీ యువత నవ్వింది.

అంతలో మాస్టారు హడావిడిగా వచ్చారు. "బాబూ! భాస్కరూ! ఈ రోజు ఒక గొప్ప కార్యక్రమం కుది రింది ఆ రాముడి దయ వల్ల. రామానంద తీర్థులని ఒక స్వామీజీ రామనామ సంకీర్తనం చేసి 'రామ కళ్యాణం' కథా కాలక్షేపం చేస్తారు. మనం తప్పక వెళ్ళాలి!" అన్నారు.

"అలాగే మాస్టారూ!" వినయంగా అన్నాడు భాస్కర్. మాస్టారు లోనికి వెళ్ళారు.

"నాకు తలనొప్పిగా వుంది. పడుకుంటా!" అంటూ శ ర్మ లేచి వెళ్ళాడు.

తరువాత వారి సంభాషణ రాజకీయాల మీదికి మళ్ళింది.

* * *

రామానందతీర్థుల వారి ఆధ్వర్యంలో రామనామ సంకీర్తనం ముమ్మరంగా జరుగుతోంది.

భాస్కర్ బృందం పందిట్లో ఒక పక్కన కూర్చు న్నారు. వారితో పాటే యువ బృందం కూడా వుంది.

శర్మ మాత్రం బాధపడుతూ, వారితో కలిసి రాలేక, తలనొప్పంటూ అలకపాను పెక్కాడు.

పందిట్లో హారతి పళ్ళెం భక్తుల వద్దకు వస్తోంది. కార్యక్రమాల ఖర్చుల నిమిత్తం ఎవరికి తోచినంత వారు కానుకలు వేస్తున్నారు. కొద్ది సేపట్లో వెయ్యి రూపా యల వరకు ప్రోగయ్యింది. భాస్కర్ కూడా వంద రూపాయలు చెల్లించాడు.

అంతలో వున్నట్టుండి ఎక్కడినుంచో ఒక ముసుగు మనిషి చేతిలో రివాల్వర్ పట్టుకుని, ఒక్క పరుగున పందిట్లోకొచ్చాడు.

"ఆపండాపి భజన్లు! ఎక్కడివాళ్ళక్కడే వుండండి! కదిలారా...కాల్చేస్తా!" బిగ్గరగా అరిచాడు.

అంతా క్షణాల్లో లేచారు. ఆ బందిపోటు భాస్కర్‌కి దగ్గరగా వున్నాడు. జనంలో గందరగోళం మొదలైంది. ఏడుపులు వినిపిస్తున్నాయి.

"ఆడవాళ్ళు నగలు, మగవాళ్ళు డబ్బులూ ఆ హారతి పళ్ళెంలో వేసి నాకివ్వాలి. ఇవ్వకపోయారో కాల్చి చంపుతా! అంతా యీ రివాల్వర్‌ని చూడండి!" అంటూ చెయ్యెత్తి రివాల్వర్‌ని చూపాడు.

అంతా వణికిపోతున్నారు. భాస్కర్ యీ విచిత్ర పరిణామానికి నివ్వెరపోయి, ఎలా ఆ దొంగని బంధిం చాలా అని ఆలోచించసాగాడు.

అంతలో కానుకల పళ్ళెం ఆ దొంగ వద్దకు తేబడ్డది. దానిలో రివాల్వరుంచి, డబ్బు తీసుకోబోయాడు దొంగ. ఆ అదును చూసి క్షణంలో భాస్కర్ వంగి, క్రింద పరిచిన దుప్పటిని బలంగా లాగాడు. దానితో ఆ దొంగ కానుకల పళ్ళెం పట్టుకున్న వ్యక్తి అమాంతం క్రింద పడిపోయారు. భాస్కర్ బోర్లాపడ్డ దొంగ మీద పడి, వాడి ముసుగు లాగి, ఆ గుడ్డతో వాడి చేతులు వెనుకకు కట్టి, పైకి లేపాడు. మిగతావారు బిలబిలా బయటకి సాగారు.

చుట్టూ పోగైన జనం, వణుకుతూ వచ్చిన మాస్టారు ఆ ముసుగు దొంగ ముఖం చూచి నిశ్చేష్టు లయ్యారు. అంతలో స్వామీజీ వచ్చి, దొంగ తల నిమిరి కన్నీళ్లు విప్పుతున్నారు. భాస్కర్‌కి ఏమీ అంతుపట్ట లేదు అంతా అయోమయంగా తోచింది "ఏమిటిదంతా?"......

[పై వారం